శ్యాంరావు ముదిరాజ్‌కు సేవా పురస్కారం


అవార్డు అందుకుంటున్న శ్యాంరావు ముదిరాజ్

చాంద్రాయణగుట్ట: మూడు దశాబ్దాలుగా పాతబస్తీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్‌ను తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సేవా అవార్డుతో సత్కరించారు. నగరంలో మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్, తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ ఆయనకు అవార్డును అందజేసి సన్మానించారు.

బేగంబజార్ డీఈకి అభినందనలు


డీఈ ఫరత్ అలీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్, ప్రియాగుప్తా తదితరులు

అఫ్జల్‌గంజ్: బేగంబజార్ ఎలక్ట్రికల్ డీఈ ఫరత్ అలీకి గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్, ప్రియా గుప్తాతో పాటు పలువురు నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. నూతనంగా పదవీబాధ్యతలు స్వీకరించిన ఆయనకు గోషామహల్ నియోజకవర్గంలో ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా మున్సిపల్ మజ్దూర్ యూనియన్


నూతనంగా ఎన్నికైన వారిని సన్మానిస్తున్న దృశ్యం

అబిడ్స్: ఉద్యోగులకు మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ నిరంతరం అండగా ఉండి వారి శ్రేయస్సుకు కృషి చేస్తుందని ఆ యూనియన్ జీహెచ్ఎంసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ పేర్కొన్నారు. బుధవారం ఆదిల్ షరీఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యోగులు యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ..జీహెచ్ఎంసీ ఉద్యోగుల సంక్షేమమే వారి అభివృద్ధే తమ యూనియన్ ముఖ్యోద్దేశమన్నారు. ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శిగా ఏవీఎస్ గాంధీని, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులైన ఎం.రామకృష్ణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు విజయ్‌కుమార్, నర్సింహాస్, శ్రీకృష్ణ యాదవ్, మోజెస్, జి.శ్రీనివాస్, రమేష్, కోదారి రాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్


వాహనదారుడి పత్రాలను పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీను నాయక్

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట ప్రధాన రహదారులపై ట్రాఫిక్ స్తంభించకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జె.శ్రీను నాయక్ తెలిపారు. చాంద్రాయణగుట్టలో బుధవారం ట్రాఫిక్ ఉల్లంఘనులపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. రాంగ్ రూట్, మైనర్ డ్రైవింగ్ చేస్తున్న వారిని గుర్తించి చలానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాంద్రాయణగుట్ట, ఎంబీఎస్ఆర్ చౌరస్తాలలో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూస్తున్నామన్నారు. ముఖ్యంగా బస్సు బే లలో ఆటోలు తిష్టవేయకుండా కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు.

ప్రత్యేక పూజలు



జియాగూడ: జియాగూడ రంగనాథ ఆలయంలో హైకోర్టు జస్టిస్ మాధవీదేవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం పెళ్లి రోజును పురస్కరించుకొని దంపతులు ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు బద్రీనాథ చార్యులు, రంగనాథ చార్యులు సన్మానించి ఆశీర్వదించి ప్రసాదాలను అందజేశారు.

ఐడీబీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో వాకథాన్



సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభమయ్యే 'విజిలెన్స్ అవేర్నెస్ వీక్' నేపథ్యంలో నగరంలోని ఐడీబీఐ బ్యాంక్ జోనల్ ఆఫీస్ ఉద్యోగులు ప్రత్యేక వాకథాన్‌నిర్వహించారు. ఎల్‌బీ స్టేడియం రోడ్డు మీదుగా ఏర్పాటు చేసిన ఈ వాకథాన్‌లో భాగంగా ఐడీబీఐ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ శరత్ కుమార్ కామత్ మాట్లాడుతూ..అవినీతికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మార్కెట్లకు దీపావళి శోభ

పండుగకు అలంకరణ కొనుగోళ్లు

బేగంబజార్, సిద్ధిఅంబర్‌బజార్, ఛత్రి మార్కెట్లలో సందడి


విద్యుత్ జూమర్లు


విద్యుత్ జ్యోతులు

అబిడ్స్/జియాగూడ: దీపావళిని పురస్కరించుకొని గృహ అలంకరణ, వ్యాపార సముదాయాలకు కావాల్సిన వస్తువుల కోసం వచ్చిన కొనుగోలు దారులతో బేగంబజార్ మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. పండుగలకు సంబంధించిన వస్తువులు తక్కువ ధరలకే లభిస్తుండడంతో హోల్‌సేల్, రిటైల్ మార్కెట్‌లకు కొనుగోళ్ల తాకిడి అధికంగా ఉంటుంది. దీపావళికి ప్రత్యేక ఆకర్షణ మిరుమిట్లు గొలిపే దీపకాంతులు, విద్యుత్, మట్టి, ప్లాస్టిక్, శిరమిక్ దీపాలు వివిధ సైజు, అంకరణ, రంగులలో లభిస్తున్నాయి. అలాగే జూమర్లు, అగర్‌బత్తులు, పూజా పీటలు, పూజా సామగ్రి, వన్ గ్రామ్ గోల్డ్ అర్నమెంట్స్, దొంతులు, బొమ్మల కొలువు బొమ్మలు, క్యాండీల్స్, తదితరవి ఎన్నో లభిస్తున్నాయి.

29 నుంచి దీపావళి వేడుకలు ప్రారంభం..

ఈనెల 29న దంతెరాస్ పూజ, 30న శ్రీ కాళి చౌదశ, 31న శ్రీ నరక చతుర్దశి, దీపావళి పర్వదినం, 2న శ్రీ గోవర్ధన పూజ, 3న భాయ్‌దుజ్ వేడుకలతో పూర్తి అవుతాయి. దీంతో వేడుకలకు కావాల్సిన వస్తువులు కొనుగోళ్ల కోసం ఉత్తర భారతీయులు, హోల్‌సేల్, రిటైల్ విక్రయదారులతో పాటు పలు ప్రాంతాల నుంచి పండుగకు కావాల్సిన వస్తువులు కొనేందుకు చేరుకుంటున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.


పూజా సామగ్రి కొనుగోళ్లతో భర్తన్ బజార్


గృహ అలంకరణ వస్తువులు కొనుగోలు చేస్తున్న దృశ్యం


కిటకిటలాడుతున్న బేగంబజార్ మార్కెట్

గోషామహల్ నాలా నిర్మాణాలు కొత్తగా చేపట్టాలి

అబిడ్స్: గోషామహల్ ప్రధాన రోడ్డుపై వెళ్తున్న అతి పురాతన నాలా పై కప్పు మొత్తాన్ని కొత్తగా నిర్మించాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. చాక్నవాడి ప్రాంతంలో కుప్పకూలిన నాలా ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ..రెండేళ్ల క్రితమే చాక్నవాడి ప్రాంతంలో నాలా కూలిపోవడంతో కొత్తగా పైకప్పు నిర్మాణాలు చేపట్టారన్నారు. దాని సమీపంలో మరోసారి నాలా కూలడం ఎంతో బాధాకరమన్నారు. ఉదయం పూట నాలా కూలితే పెను ప్రమాదం సంభవించేదన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, ఇతర జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు గోషామహల్ నాలా ప్రాంతాన్ని సందర్శించి నూతన నాలా పైకప్పు నిర్మాణాలను చేపట్టాలన్నారు. గోషామహల్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఎం.కృష్ణ, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆల పురుషోత్తమ్ రావు, సురేష్ ముదిరాజ్, ఇతర పలువురు నాయకులు నాలాను పరిశీలించారు.



ప్రహరీ నిర్మాణాన్ని విరమించుకోవాలి


జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న మన్నె శ్రీధర్

నాంపల్లి: అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ప్రహరీ నిర్మించకుండా విరమించుకోవాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మన్నె శ్రీధర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రాన్ని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మన్నె శ్రీధర్‌రావు మాట్లాడుతూ.. సుందరీకరణ పేరుతో అంబేడ్కర్ విగ్రహం కనిపించకుండా చేసే ప్రయత్నం చేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ మౌర్య, రాజేష్ తాలుకా, అంజలి, శాస్త్రి ప్రవీణ్‌కుమార్, జి.కల్యాణ్, పుణ్యభాను, కమల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి

గౌలిపురా: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి అన్నారు. గౌలిపురా డివిజన్‌లోని హనుమాన్‌నగర్ కామాక్షమ్మ ఆలయం వద్ద బుధవారం కార్పొరేటర్ భాగ్యలక్ష్మి నూతన సీవరేజ్ పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..బస్తీవాసులు మురుగు నీటి సమస్య ఉండటంతో తన దృష్టికి తీసుకురావడం జరిగిందని..దీంతో తాను జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రూ.1.80 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. దీంతో నూతన సీవరేజ్ పైప్ లైన్ పనులను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ పెద్దలు జి.నర్సింగ్ రావు, ఆకుల శ్రీరాములు, ఎం.నరసింహాదాస్, ఎ.ప్రభాకర్‌రావు, నాని, గౌలిపురా డివిజన్ అధ్యక్షుడు జి.రఘుకాంత్, నాయకులు ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, కె.రాజ్ కుమార్, స్వప్న, కొడి సురేందర్, డొంకి యాదగిరి, జె.అశోక్, బి.రమేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు


వైద్యులతో సమావేశమైన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రావు

గోల్కొండ: ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన ఆసుపత్రి వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన ఆసుపత్రి ఆర్ఎంవో-1 సుధాకర్ తదితరులతో మరిన్ని మెరుగైన వైద్య సేవలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రిలో ఫిజిషియన్స్, గైనకాలజిస్ట్ ఇతర వైద్య విభాగాలే కాకుండా దంత విభాగం, ఈఎన్‌టీ, డెర్మా తదితర విభాగాల వైద్య సేవలు కూడా అందుతున్నాయన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో-2 డాక్టర్ రమ్య, డాక్టర్ ప్రభావతి తదితరులున్నారు.

ముగిసిన కోదాటి శత జయంతి ఉత్సవాలు


కోదాటి లక్ష్మీ నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్.జె.దొర

నాంపల్లి: తెలంగాణ తొలి మాండలిక నాటక రచయిత కోదాటి లక్ష్మీ నరసింహారావు శత జయంతి ఉత్సవాలు ముగిశాయి. ఈ ఉత్సవాలు తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య ఆధ్వర్యంలో తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగాయి. ముగింపు సందర్భంగా రెండవ రోజు కళానికేతన్ హైదరాబాద్ సమర్పణలో లక్ష్మీ నరసింహారావు రచించిన డాక్టర్ వెంకట్ గోవాడ దర్శకత్వంలో ప్రదర్శించిన స్వార్థం నాటిక ఆకట్టుకుంది. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ డీజీపీ హెచ్.జె.దొర హాజరయ్యారు. అనంతరం నాటికలోని కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు తడకమళ్ల రాంచందరరావు, ప్రధాన కార్యదర్శి సాధు శ్యాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

గౌలిపురా: మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న నరేశ్ హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొంది చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యాడు. దీంతో బుధవారం మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్‌తో పాటు ఎస్సైలు, సిబ్బంది నరేశ్‌ను పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.


నరేశ్‌ను సన్మానిస్తున్న ఇన్‌స్పెక్టర్ నాగదుర్గా ప్రసాద్ తదితరులు

పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలి


అశోక్

సుల్తాన్‌బజార్: తెలంగాణలోని వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డీఏలను విడుదల చేయాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులకు హెల్త్ కార్డ్స్ ద్వారా క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ జరిగేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. అలాగే చాలా కాలంగా ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న బిల్స్ క్లియర్ చేసి పీఆర్సీని త్వరగా ప్రకటించాలని కోరారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని జీఓ నెంబర్ 317 ద్వారా ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని లేని పక్షంలో ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

నాటక రంగాన్ని కాపాడుకుందాం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రవి అండ్ రవి ఆర్ట్స్ అసోసియేషన్ 66వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహమేరా జీవితం, శివ సంకల్పమస్తు పుస్తకాలను ఆవిష్కరించగా సుప్రభాతం, ప్రేమకు పరాకాష్ట నాటకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..ప్రస్తుత సమాజంలో నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. నాటకరంగ దర్శకుడు మాడుగుల వెంకట కృష్ణమోహన్ ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాలలో నాటకాలను ప్రదర్శించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ హాస్యబ్రహ్మ శంకర నారాయణ, సత్యకళాభారతి వ్యవస్థాపకులు సత్యనారాయణ, సినీ నిర్మాత ఉమేష్ కుమార్, పలువురు నాటక రంగ నటీ నటులు, సంస్థ అధ్యక్షులు వెంకట కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఆరుగురికి జైలు

చాంద్రాయణగుట్ట: ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో వ్యక్తిపై జరిగిన దాడి కేసులో ఆరుగురు నిందితులకు నాంపల్లి న్యాయస్థానం మూడు నెలల జైలు శిక్షను విధించింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఉప్పుగూడ శివసాయినగర్‌కు చెందిన పొన్న శ్రీనివాసారావుపై 2018లో ఎన్.రఘువరణ్, ఎన్.రాజు, జి.శ్రవణ్, ఎన్.సత్యనారాయణ, ఎన్.యాదమ్మ, ఎన్.సరస్వతీ దాడికి పాల్పడ్డారు. దీనిపై కేసు నమోదు చేసిన ఛత్రినాక పోలీసులు దర్యాప్తు చేపట్టి కోర్టులో ఛార్జీషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి నిందితులకు మూడు నెలల జైలు శిక్షతో పాటు రూ.100ల జరిమానా విధించారు.

వ్యక్తి అదృశ్యం



సంతోష్‌నగర్: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సైదాబాద్ చంద్రయ్య హట్స్ ప్రాంతానికి చెందిన జె.అంజయ్య పెద్ద కుమారుడు జె.స్వామి (31) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. స్వామి రూ.లక్ష బ్యాంక్ లోన్ తీసుకొని ఈఎంఐలు చెల్లించకుండా ఎనిమిది నెలల క్రితం ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

క్లీన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి


క్లీన్లినెస్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: కార్వాన్‌ను క్లీన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన కార్వాన్‌లో క్లీన్లినెస్ డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 21 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులతో పాటు ఇతర అభివృద్ధి పనులు కూడా జరుగుతాయన్నారు. ప్రతి వార్డును తీర్చిదిద్దేందుకు అవసరమైన పారిశుద్ధ్య పనులు, అవసరమైతే సుందరీకరణ కూడా చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా హకీంపేట్ ఐస్ ఫ్యాక్టరీ, ఎండిలైన్స్ మేధర్ బస్తీ, శాతం చెరువు అవుట్‌లేట్, పోలీస్‌లైన్ క్వార్టర్స్, కరోరా హౌస్ తదితర ప్రాంతాల పరిసరాలలో పారిశుద్ధ్య పనులు భారీ ఎత్తున చేపడతామన్నారు. పారిశుద్ధ్యం అంటే కేవలం చెత్త తొలగించడమే కాకుండా చెత్త వేయడానికి ప్రత్యేకంగా స్థలాలను కూడా కేటాయిస్తామన్నారు. కార్వాన్, లంగర్ హౌస్, నానల్‌నగర్ తదితర ప్రాంతాల్లో సైతం చెత్త వేయడానికి బిన్‌లు ఏర్పాటు చేసి చెత్తను ఎప్పటికప్పుడు తరలించేందుకు తగిన వ్యవస్థను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. బల్దియా డిప్యూటీ కమిషనర్ శశిరేఖ, ఏఎంఓహెచ్ డాక్టర్ హిర్షాద్, రామ్‌కీ ప్రతినిధి ప్రశాంత్‌మిశ్రా, మురళీచక్రవర్తి, ఏఈ శేషయ్య, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

సమాజ సేవకు యువత ముందుకు రావాలి


మహ్మద్ నజీబ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: సమాజ సేవకు యువత ముందుకు రావాలని ఇంటర్నేషనల్ పీస్ అంబాసిడర్ డాక్టర్ మహ్మద్ నజీబ్ అన్నారు. ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ వారు తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్‌కు పీస్ అంబాసిడర్‌గా ఎంపిక చేసిన సందర్భంగా బుధవారం ఆయనను మునావర్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంకిత భావంతో చేసే సమాజ సేవ ద్వారా సమాజంలో గుర్తింపు పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో మునావర్, ఆసిఫ్, మహ్మద్ తదితరులున్నారు.

'ప్రజా వ్యతిరేక కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతాం'


కార్యకర్తలతో తరలివచ్చిన ఆశీష్‌కుమార్ యాదవ్

అబిడ్స్: ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ సమీపంలోని కోర్టుకు మాజీ మంత్రి కేటీఆర్ రావడంతో వందలాది మంది కార్యకర్తలతో కలిసి బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ కేటీఆర్‌కు సంఘీభావం తెలిపారు. ఎగ్జిబిషన్ రోడ్డులో కేటీఆర్ తరపున పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆశీష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ కనుమరుగవ్వడం ఖాయమన్నారు. అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్ పట్ల తీవ్ర వ్యతిరేకంగా ఉన్నారని ఆయన అన్నారు.

వాటర్‌బోర్డులో పెండింగ్ బిల్లులు విడుదల చేయండి


ఎండీ అశోక్‌రెడ్డితో సమావేశమైన పోల్కం శ్రీనివాస్ తదితరులు

అఫ్జల్‌గంజ్: వాటర్‌బోర్డులో పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని తెలంగాణ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ మీడియా ఇన్‌చార్జి అండ్ సెక్రెటరీ పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. పాత బకాయిలు రాకపోవడంతో వందలాది మంది కాంట్రాక్టర్లు రోడ్డుపాలయ్యారన్నారు. వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డితో పోల్కం శ్రీనివాస్, వజ్యుద్దీన్ మహ్మద్, ఇమ్రాన్, విక్రమ్, ప్రవీణ్‌కుమార్, యాదగిరి, జనార్దన్‌తో పాటు పలువురు కాంట్రాక్టర్లు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ..గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పనులు చేసిన వందలాది మంది కాంట్రాక్టర్లకు నేటి వరకు బిల్లులు రాకుంటే ఎలా జీవిస్తారని పేర్కొన్నారు. తాము గతంలో పలుసార్లు ప్రిన్సిపాల్ సెక్రెటరీ, ఇతర ఉన్నతాధికార్లను కలిసి కాంట్రాక్టర్లను ఆదుకోవాలని పేర్కొన్నప్పటికీ ఇంతవరకు పాత బకాయిలు చెల్లించలేదన్నారు. ఇందిరమ్మ రాజ్యమంటే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు.

రాణాకు చేరిన 'చెత్త' పంచాయితీ

● ఒకరిపై దాడి

విజయనగర్‌కాలనీ: తమ ఇంటిపై చెత్త వేస్తున్నారంటూ మొదలైన గొడవ పంచాయితీ పోలీస్‌స్టేషన్ చేరింది. ఆసిఫ్‌నగర్ సయ్యద్ అలీగూడలో ఆదిల్(27), తన సొంతింట్లో రెండో అంతస్తులో ఉంటున్నాడు. ఇతడి పక్కింటి భవనంలో 3వ అంతస్తులో మహ్మద్ ఇస్మాయిల్ కుటుంబ సభ్యులతో నివసిస్తున్నాడు. 3వ అంతస్తు నుంచి తరచూ 2వ అంతస్తులో చెత్త వేస్తుండడంతో గొడవలు జరుగుతుండేవి. ఈ నెల 20న చెత్త విషయమై మళ్లీ ఇరువురు గొడవ పడ్డారు. ఇస్మాయిల్ అన్నదమ్ములు మహ్మద్ ముజీబ్, మహ్మద్ ఇబ్రహీం, మహ్మద్ కలిసి ఆదిల్‌పై పిడిగుద్దులు కురిపిస్తూ దాడి చేశారు. అడ్డెకు ఉంటున్న అహ్మద్‌ను కూడా కొట్టారు. స్పృహ కోల్పోయిన ఆదిల్‌ను పోలీసులు చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. బాధితుడి సోదరుడు మహ్మద్ జహీరుద్దీన్ భక్తియార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.